క్లుప్తంగా

సైనికుడికి ఘనంగా సన్మానం



సైనికుడు సూర్యకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని వీరభద్రపేట గ్రామానికి చెందిన సైనికుడు పట్రాన సూర్య కుమార్‌ను కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. సైనికుడు సూర్యకుమార్ కొట్యాడ హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నారు. కాగా ఆగస్టు-31వ తేదీ నాటికి 17 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొంది మొట్టమొదటి సారిగా స్వగ్రామానికి వచ్చే ముందు తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో అడుగు పెడతానని ఆయన చెప్పడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలిసి సూర్యకుమార్‌కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కొట్యాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొత్తవలస: అర్హులైన పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు.ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తూ, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. కొత్తవలస పట్టణ ప్రాంతంలో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, తర్వాత రద్దు చేసిందని, ఆ పట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పటిలో పట్టాలు పొందిన వారితో కలిసి తహసీల్దార్ పి.అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలల సందర్శన



వసాదిలో ఉపాధ్యాయలతో మాట్లాడుతున్న అధ్యాపకుడు చిన్నంనాయుడు

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం, సిరిపురం ప్రాథమిక పాఠశాలలు, వసాది జెడ్పీ హైస్కూల్, గంట్యాడ కేజీబీవీని విజయనగరం డైట్ అధ్యాపక బృందం మంగళవారం సందర్శించింది. టీచర్స్ హ్యాండ్ బుక్స్ ఉపయోగిస్తున్న విధానం, విద్యార్థుల వర్క్ బుక్స్, ఎసైన్మెంట్స్, మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలువుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అలాగే విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. డైట్ అధ్యాపకులు వాక చిన్నంనాయుడు,ఎ.శశిభూషణరావు, ఎస్.ఈ.శర్మ, కె.అన్నారావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



రాంబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు, పోస్టల్ సిబ్బంది

గజపతినగరం రూరల్: మరుపల్లి పోస్టాఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సుంకర రాంబాబును పోస్టల్ సిబ్బంది, గ్రామస్తులు సోమవారం సన్మానించారు. రాంబాబు సేవలను గ్రామస్తులు కొనియాడారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: విద్యార్థులు కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా అరుదైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వి.కృష్ణాజీ చెప్పారు. ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండో కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే స్థానిక కళాశాలలో ఒక కంప్యూటర్ ల్యాబ్ ఉందన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో పట్టుసాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.స్థానిక కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహానేతా.. మీ జ్ఞాపకాలు పదిలం

తెలుగు ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, వైఎస్సా ర్‌సీపీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లో వాడవాడలా మంగళవారం నిర్వహించారు.చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి, గరివిడిలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎస్.కోటలోని దేవీ జంక్షన్, కొత్తవలస మూడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, గుర్ల మండలంలోని కెల్ల జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలు అన్ని రంగాల్లో ఎదగాలని, వారి అభివృద్ధి కోసం పనిచేసిన మహానేత రాజశేఖరరెడ్డి అని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేశారని చెప్పారు. మండల కేంద్రాల్లో, గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల, వివిధ విభాగాల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మెరకముడిదాం: మెరకముడిదాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు బూడి వెంకటరావు



జామి: జామిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అవినాష్, తదితరులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు



కొత్తవలస: కొత్తవలసలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాయుడుబాబు నాయుడుబాబు



జామి: జాగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు



వేపాడ: వేపాడలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్థానిక నేతలు



గంట్యాడ: కొఠారుబిల్లి జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి



గుర్ల: కెల్ల జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బొండపల్లి: బొండపల్లిలో జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, నాయకులు చిన్నంనాయుడు, తదితరులు



దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి, కృష్ణార్జున్



గంట్యాడ: పెదవేమలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

మెరకముడిదాం: మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల బారిన పడింది. దీంతో తాగునీటి బోరుబావి మోటారు పనిచేయకపోడంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. అలాగే పలువురు వినియోగదారుల ఇళ్లకు విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్య ఉండేది. ఈ నేపథ్యంలో సాక్షి దినపత్రికలో ఆగస్టు 31న 'పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ దివాకరరావు మరమ్మతుల బారిన పడిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గొట్టుపల్లిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంధి

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రధాన రహదారి అభివృద్ధికి అందరి సహకారం కావాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు దుకాణాల యజమానులను కోరారు. ఈ మేరకు మంగళవారం తన సిబ్బందితో కలిసి ప్రధాన రహదారి రెండవ వైపున ఉన్న దుకాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి రెండవ వైపు కాలువల నిర్మాణం కోసం దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని కోరారు. రెండు రోజుల్లో రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎక్కడా అపోహలకు అవకాశం లేదని, కచ్చితమైన రెవెన్యూ సర్వే రికార్డుల ఆధారంగా మార్కింగ్ చేశామని, రోడ్డును ఆధారంగా చేసుకుని మార్కింగ్‌ను చూడడం సరికాదన్నారు. రోడ్డు అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయం సిబ్బందితో పాటు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



ఎస్.కోటలో దుకాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

ఇండియన్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ల నియామకం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ సీహెచ్.శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ డి.దాలిబాబులు రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎస్.కోట శాఖకు చెందిన మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్ డి.,సూర్యారావు, కోఆర్డినేటర్ మన్మధరావులు నియామక పత్రాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ద్వారా మంగళవారం అందజేశారు. రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు కోఆర్డినేటర్లుగా తమ వంతు సహాయ సహకారం అందిస్తామని బాధ్యతలు తీసుకున్న లెక్చరర్లు శ్రీనివాసరావు, దాలిబాబులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్.కేశవరావు, పి.కృష్ణమూర్తి, ఇతర లెక్చరర్లు పాల్గొన్నారు.



కోఆర్డినేటర్ నియామకపత్రాన్ని ప్రిన్సిపాల్‌కు ఇస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు సూర్యారావు,మన్మధరావులు

నానో యూరియా వినియోగంపై అవగాహన



దత్తిరాజేరులో డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



వేపాడ: అరిగిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతి

వేపాడ: పొలంబడి కార్యక్రమంలో భాగంగా నానో యూరియా వినియోగం, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై మండలంలోని అరిగిపాలెం, జగ్గయ్యపేట గ్రామాల్లో రైతులకు ఏఓ స్వాతి మంగళవారం అవగాహన కల్పించారు. ఎకరానికి 500 మిల్లీలీటర్ల నానో యూరియా సరిపోతుందని చెప్పారు. 500 మిల్లీలీటర్ల నానో యూరియాను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు. సాధారన యూరియా కంటే నానోయూరియా ధర తక్కువ, ప్రయోజనాలు ఎక్కువ అని చెప్పారు.సుస్థిర సేంద్రియ వ్యవసాయం కో-ఆర్డినేటర్ వెంకటరావు, ఎఫ్‌పీఓ సీఈఓ వెంకటరావు, ఏపీ సీఎస్‌ఎఫ్ మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌చార్జి రామలక్ష్మి పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: డ్రోన్ ద్వారా వరి పంటకు నానో యూరియా,డీఏపీ ద్రావణాన్ని పిచికారీ చేసే విధానంపై మండల కేంద్రంలో రైతులకు ఏఓ అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. రైతు శిక్షణా కేంద్రం ఏఓ గోవిందమ్మ మాట్లాడుతూ నానో ఎరువులు వాడడం వల్ల తక్కువ ఖర్చులతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని చెప్పారు.

- రైతులకు యూరియా ఇవ్వలేని సర్కారు
- వ్యవసాయశాఖ కార్యాలయం ముందు వైఎస్సార్‌సీపీ నిరసన

చేతకాని ప్రభుత్వం



వ్యవసాయశాఖ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: రైతులకు అవసరమైనంత మేరకు యూరియా కూడా సరఫరా చేయలేనంత దీనస్థితిలో చేతకాని కూటమి ప్రభుత్వం ఉందని దీనిని కూటమి ప్రభుత్వం, నాయకులు ఒప్పుకుని రైతులను క్షమాపణ చెప్పాలని మండలానికి చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్వీ రమణరాజు, తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఎరువులు సరిపడా సరఫరా చేయకపోవడంపై మంగళవారం స్థానిక వ్యవసాయకార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెరకముడిదాం మండలానికి ప్రతి ఏడాదీ 600 మెట్రిక్ టన్నులు ఎరువులను రైతులకు రైతుభరోసా కేంద్రాల వద్దనే అందజేసేవారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక మండలంలో కేవలం 450 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే పంపిణీ చేశారని అసహనం వ్యక్తం చేశారు. పంటలు పండించే రైతులకు ఎరువులు కూడా అందించలేని ప్రభుత్వం ఏమి ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఇచ్చిన ఆ కాస్త ఎరువులు కూడా కూటమి నాయకులు తమకు అనుకూలమైన వారికే పంపిణీ చేసుకున్నారని నిజమైన రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ జరగలేదని నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా రైతులు. ప్రజలు ఆలోచన చేయాలని గత ప్రభుత్వ హయాంలో ఎరువులు, విత్తనాలు ఏవిధంగా అందించేవారు? ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏవిధంగా అందిస్తోందో గమనించాలని కోరారు. అలాగే ఈనెల 6 వ తేదీన చీపురుపల్లిలో డివిజన్ స్థాయిలో ఎరువుల కోసం నిర్వహించే ధర్నాలో మండలానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, బూర్లెనరేష్‌కుమార్, వైస్ ఎంపీపీలు తలచట్లహరిబాబు, కందుల మల్లికార్జునరావు, పప్పలకృష్ణమూర్తి, కర్రోతు నాగేశ్వరరావు, రేగిడి లక్ష్మణరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన జిందాల్ నిర్వాసితుల ఆందోళన

శృంగవరపుకోట: కంపెనీ కడతామని భూములు తీసుకుని 18ఏళ్లు గడిచినా కంపెనీ కట్టకుండా రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధమవుతున్న జిందాల్ యాజమాన్యానికి మద్దతు పలుకుతున్న అధికారుల తీరు సిగ్గుపడేలా ఉందని రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు తమ ఆందోళన కొనసాగించారు. కంపెనీకి ఇవ్వని భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి, వందల సంఖ్యలో చెట్లు అక్రమంగా నరికేస్తే చర్యలు లేవన్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు రెవున్యూ, పోలీస్ యంత్రాంగం మొత్తం జిందాల్ కోసం ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. రైతుల కష్టాలు ఏమిటి? ఎందుకు ఉద్యమాలు చేస్తున్నారు? 70రోజులుగా ఎందుకు రోడ్డుపై ఉన్నారో తెలుసుకునే ప్రయత్నం చేయక పోవడం సిగ్గుచేటన్నారు.

అన్నదానం

గజపతినగరం: వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్థానిక షరాబుల కాలనీలో వినాయక మంటపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం అన్నదానం చేశారు. సుమారు 3వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని తహసీల్దార్ సీహెచ్.బంగారుదొర అన్నారు. ఈ మేరకు గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎస్సై బి.లోకేశ్వరరావు సమక్షంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు మతసామరస్యాన్ని పాటించి వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలను, రాబోయే ముస్లిం పండగను శాంతియుతంగా, సమన్వయంతో జరుపుకోవాలని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి ఉద్వేగాలకు లోనుకాకుండా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని చెప్పారు. ఊరేగింపుల ప్రదర్శనలు నిర్వహించాలనుకుంటే ముందుగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, జి.శ్రీరాములునాయుడు, టీడీపీ నాయకులు సారిపాక సురేష్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

దత్తిరాజేరు: కోమటిపల్లి -దత్తిరాజేరు రోడ్డులో గొభ్యాం కూడలి వద్ద ప్రమాదకరంగా గొయ్యి ఏర్పడడంతో సమస్యపై సాక్షిలో 'రోడ్డు మధ్యలో గొయ్యి' శీర్షికతో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ జేఈ అజయ్ భార్గవ్ గొయ్యికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కల్వర్ట్ నిర్మాణానికి ఇతర పనుల కోసం రూ.24 లక్షలు మంజూరయ్యాయని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.



గొభ్యాం కూడలి వద్ద గొయ్యి ఏర్పడిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జామి: వరి పంటకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచిదిగుబడులు సాధించవచ్చని ఏడీఏ బి.భానులత అన్నారు. మండలంలోని జాగరం గ్రామంలో ఆత్మ సౌజన్యంతో వరిలో తెగుళ్ల నివారణ,నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను ఆశించే ఆకుముడత పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ మందు 500 మిల్లీ లీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలని చెప్పారు. పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజాల్‌మందు 400 మిల్లీ లీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలని వివరించారు.ఏఓ పూర్ణిమ, డీఆర్‌సీ ఏఓ నిర్మల, ఏఈఓ అహ్మద్, వీఏఏ పూజిత, తదితరులు పాల్గొన్నారు.